క్లుప్తంగా

హెచ్ఐవీపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై యువత అవగాహన కల్గి ఉండాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ అన్నారు. స్థానిక బాబామెట్టలోని స్వధార్‌గృహలో ఉన్న మహిళలకు, కౌమార దశ బాలికలకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. యువత సన్మార్గంలో నడవాలని తెలిపారు. చెడు అలవాట్లుకు బానిస కాకూడదని తెలిపారు. హెచ్ఐవీ రోగుల పట్ల ప్రేమగా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పి.దేవి, యేసుకుమారి తదితరులు పాల్గొన్నారు.

మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న గురు భవానీలు, మాలధారులు

భోగాపురం: ఇటీవల మండలంలోని అవ్వపేట గ్రామానికి చెందిన అవ్వ రమణరెడ్డి అనే గురు భవానీ అనారోగ్యంతో మృతి చెందాడు. అతని జ్ఞాపకార్థం ఉత్తరాంధ్ర జిల్లాల భవానీ దీక్ష సేవా పీఠం తరపున భవానీ మాలధారులందరూ కలిసి రూ.20 వేలు విలువ చేసే మైక్‌సెట్‌ను సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ సేవకే జీవితాన్ని అంకితం చేసిన రమణరెడ్డి భవానీ కుటుంబ సభ్యులకు దుర్గాదేవి ఆశీస్సులు ఎల్ల వేళల ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర జిల్లాల దీక్ష సేవాపీఠం అధ్యక్షుడు పులపా మల్లేశ్వరరావు, గురు భవానీలు కొమ్మూరు రామకృష్ణ, ఎర్రయ్యరెడ్డి, సూరిబాబు, కొచ్చెర్ల గోవింద, అప్పలనరసయ్య, భవానీ మాలధారులు పాల్గొన్నారు.

స్వామివారికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

విజయనగరం టౌన్: స్థానిక సంతపేటలో కొలువైన జగన్నాథస్వామి దేవాలయంలో స్వామివారికి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త శ్రీ నమ్మాళ్వార్ దివ్య తిరు అధ్యయన మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీటీడీ ద్రవిడ వేదపండితులు అనంత వెంకట జగన్నాథచార్యస్వామి ప్రత్యక్ష నిర్వహణలో అత్యంత వైభవంగా పూజాధికాలు చేశారు. స్వామివారికి విశేష దివ్యప్రబంధ సేవాకాలం, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. జగన్నాథ సేవా సమితి, దేవదాయ శాఖ అధికారులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు రైల్వే పెన్షనర్స్ డే



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు పి.విశ్వనాథం ,కార్యదర్శి కుప్పూరావు

విజయనగరం టౌన్: రైల్వే పెన్షనర్స్ డే వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఉన్న పింఛనర్లందరూ తరలి రావాలని రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.విశ్వనాథం, ఆర్.ఎస్.కుప్పూరావు కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న రైల్వేస్టేషన్ వద్దనున్న పెన్షనర్స్ కార్యాలయ ఆవరణలో భారీ ఎత్తున వేడుకలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా చర్చించి, అధికారులకు వినతులిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైల్వే పెన్షన్ సభ్యులందరూ హాజరై , కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి సిహెచ్.జగన్నాథరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ వి.ప్రసాదరావు, ఉపాధ్యక్షులు టి.వెంకటరావు, సిహెచ్.అప్పన్న, కేవీ రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దెంకాడ: మండలంలోని చింతలవల ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ పరిధిలోని బొడ్డవలస గ్రామానికి విద్యుత్ సరఫరాను బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ పి.అప్పలనాయుడు తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉల్లాసంగా... ‘ఆడుదాం.. ఆంధ్రా..’



నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడ ఉన్నత పాఠశాలలో పోటీలను ప్రారంభిస్తున్న ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ



భోగాపురం: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా భోగాపురంలో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు



విజయనగరం రూరల్: ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, గుండాలపేట సర్పంచ్ రాజేశ్వరి



నెల్లిమర్ల రూరల్: రామతీర్థం ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు



పూసపాటిరేగలో క్రీడలు ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ పీడీ శాంతాకుమారి, అప్పలనాయుడు తదితరులు

గ్రామ, వార్డు స్థాయి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు తొలి రోజు మంగళవారం ఉత్సాహంగా.. ఉల్లాసంగా... ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని పోటీలను ప్రారంభించారు. అన్నిచోట్ల ఈ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీల్లో విద్యార్థులు, ఇతర క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



దెంకాడ: రఘుమండలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు తదితరులు



నెల్లిమర్ల: ధామస్‌పేటలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని



విజయనగరం రూరల్: సారికలో కబడ్డీ పోటీలు

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం సోషల్ మీడియా ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆవిష్కరించారు. సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కనకల కృష్ణ ఆధ్వర్యంలో రూపొందించిన 5000 క్యాలెండర్‌లను మంగళవారం తన నివాసంలో ఆవిష్కరించి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ పార్టీని అభివృద్ధి పథంలో నడిపించటంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కీలక పాత్ర పోషించాలని, ఇందులో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించటం ద్వారా పార్టీ నాయకులను, కార్యకర్తలను, ప్రజలను ఉత్తేజరపరచాలన్నారు. పార్టీ నాయకులు బొద్దాన అప్పారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, నవీన్, సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిని త్వరగా గుర్తించాలి : డీఎంహెచ్‌ఓ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

విజయనగరం ఫోర్ట్: కుష్టు వ్యాధిని త్వరగా గుర్తించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి వచ్చే ఏడాది 12వ తేదీ వరకు నిర్వహించే ఇంటింటి సర్వేకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం నుంచి ఆశ కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి చర్మంపై ఏర్పడిన మచ్చలు, ఈ మధ్య కాలంలో వచ్చిన అంగ వైకల్యం ఉన్న వారిని గుర్తిస్తారని తెలిపారు. కుష్టు వ్యాధి నిర్మూలనకు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కుష్టు వ్యాధిగ్రస్తులను తగిన సమయంలో గుర్తించి వైద్యం అందించడం వలన వ్యాధిని నిర్మూలించవచ్చునని చెప్పారు. గత ఏడాది జిల్లాలో నిర్వహించిన సర్వేలో 112 కేసులు, ఈ ఏడాది చేసిన సర్వేలో 106 కేసులు గుర్తించామన్నారు. 2027 నాటికి కుష్టు వ్యాధి కేసులు లేకుండా చేయాలన్నదనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సరోజిని

• విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నెల్లిమర్ల: విద్యార్థులు విద్యతో పాటుగా అన్ని రంగాలలో రాణించాలని నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని పిలుపునిచ్చారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని ధామస్‌పేట ఫుట్‌బాల్‌గ్రౌండ్‌లో ఆడుదాం ఆంధ్ర అనే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటుగా అన్ని రంగాలలో రాణించాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా ఇది అందరి ఆట అనే కార్యక్రమాన్ని మన ముందుకు తీసుకువచ్చారన్నారు.విద్య,వైద్య అన్ని విషయాల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రతివిషయంలో కూడా మంచి ఆలోచన చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు,వైస్ చైర్మన్ ఎస్ రామారావు,కమిషనర్ పి బాలాజీప్రసాద్,కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్,శ్రీనివాసరావు,పలు కార్పొరేషన్‌ల డైరక్టర్లు జానాప్రసాద్,నౌపాడ శ్రీనివాసరావు,నాయకులు బంగారు శంకర్రావు, ఇడదీసి శ్రీనివాసరావు,మహంతి అప్పలనాయుడు,బూర సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబు సేవలు మరువం

నెల్లిమర్ల: జరజాపుపేట మాజీ సర్పంచ్ నల్లి అప్పలసూర్యనారాయణ (సూరిబాబు) సేవలు మరువలేనివని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. జరజాపుపేటలో మాజీ సర్పంచ్ నల్లి అప్పల సూర్య నారాయణ ఆరో వర్ధంతి మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూరిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ నల్లి సూరిబాబు సర్పంచ్‌గా, కార్మిక నేతగా చేసిన సేవలు మరువలేనివన్నారు. కుటుంబ సభ్యులు బోని సత్యవతి, బోని శ్రీనివాసరావు, నల్లి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు మద్దిల సన్యాసిరావు, కానిస్టేబుల్ మద్దిల ప్రసాద్ పాల్గొన్నారు.

వసతిగృహంలో పారిశుద్ధ్యం అధ్వానం



వసతిగృహంలో విద్యార్థులు స్నానాలు చేసే చోటు

నెల్లిమర్ల: పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలురు వసతిగృహంలో సమస్యలు తిష్ట వేశాయి. ముఖ్యంగా పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. దాంతో పాటు మరుగుదొడ్ల నిర్వహణ, స్నానాలు చేసే చోటు నాచుతో నిండిపోవటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వసతిగృహంలో 48 మంది విద్యార్థులుంటున్నారు. అధికారులు దృష్టి సారించి తమ సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. వసతిగృహం ప్రాంగణంలో పిచ్చి మొక్కలు ఎక్కువ గా ఉండటంతో పాములు ఎక్కువగా తిరుగు తున్నాయని విద్యార్థులు భయపడుతున్నారు. ఈ సమస్యలపై వసతిగృహ సంక్షేమాధికారి సింహాచలం వద్ద సాక్షి ప్రస్తావించగా.. ఈ సమస్యలు పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

వలంటీర్ల సమ్మె ప్రకటన అసత్యం

• తామంతా విధుల్లో ఉన్నామని కార్పొరేషన్ వలంటీర్ల స్పష్టీకరణ



విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని వార్డు వలంటీర్లు

విజయనగరం: ప్రభుత్వ సేవలను ప్రజలకు క్షేత్ర స్థాయిలో అందించాలని సదుద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాటిని ఎవరూ నమ్మొద్దని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పని చేస్తున్న వలంటీర్లు మంగళవారం స్పష్టం చేశారు. తామేమి సమ్మె ప్రకటన చేయలేదని సోషల్ మీడియాలో జరుగుతున్నది అంతా అసత్య ప్రచారమని పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఉన్న వలంటీర్లంతా ప్రభుత్వం తమ కేటాయించిన విధుల్లో నిమగ్నమై ఉందని తెలిపారు. తాము సేవా దక్పథంతో గత నాలుగు నెలలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని ఏ విధమైన ఇతర ఆలోచనలు తమకు లేవని చెప్పారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అవాస్తవ ప్రచారాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను చూసి తాము కూడా ఆశ్చర్యానికి లోనయ్యామని అదంతా తప్పుడు ప్రచారం అని కొట్టి పారేశారు.

వనితా వాకర్స్ క్లబ్‌కు ఉత్తమ అవార్డ్



ఉత్తమ క్లబ్ అవార్డు అందుకుంటున్న సుభద్రాదేవి

విజయనగరం: పట్టణానికి చెందిన వనిత వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖకు ఉత్తమ క్లబ్ అవార్డు లభించింది. వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముళ్ళపూడి సుభద్రదేవి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయం వెల్లడించారు. ఈ నెల 25, 26 తేదీలలో విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ సెమినార్ హాల్లో జరిగిన వాకర్స్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్ సమ్మిట్‌లో తమ క్లబ్‌కు ఈ అవార్డు అందజేసినట్టు తెలిపారు. ఈ ఏడాది తమ క్లబ్ తరఫున వరుస సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు, కొత్త సభ్యులను చేర్చుకోవడం, మహిళా దినోత్సవం, కార్మిక దినోత్సవం, ఉపాధ్యాయ దినోత్సవం, వైద్యుల దినోత్సవం నిర్వహించి ఆయా విభాగాలకు చెందిన వారిని సత్కరించడం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేయడం తదితర సేవా కార్యక్రమాలకు ఈ అవార్డు లభించినట్టు తెలిపారు. సమ్మిట్‌కు ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ బొల్లినేని శ్రీనివాసరావు, వాకర్స్ గవర్నర్ కర్రోతు సత్యం తదితరుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ పూర్వపు గవర్నర్లు ఫోర్ ఎస్.రాజు, కొత్తలి ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నట్టు తెలిపారు.

హామీలు అమలు చేయాలి



నగర పంచాయితీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న, కార్మికులు

నెల్లిమర్ల: ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీవ రమణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నెల్లిమర్ల మున్సిపల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి కాంట్రాక్టు కార్మికులందరూ విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, బకాయి హెల్త్ అలవెన్సులు, జీతాలు చెల్లించాలని, పర్మినెంట్ కార్మికులకు ఉద్యోగులకు సరెండర్ లీవ్ డబ్బులు చెల్లించాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలన్నారు. సీఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు బాబూరావు, హరిబాబు, శ్రీను, సురేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం క్రైమ్: రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించి ప్రయాణం చేయాలని రోడ్ సేఫ్టీ ఎన్‌జీఓ అధ్యక్షుడు మజ్జి అప్పారావు పేర్కొన్నారు. స్థానిక రింగురోడ్డులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో మంగళవారం రోడ్ సేఫ్టీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగేటప్పుడు తోటి ప్రయాణికులకు సహాయం చేయాలని, అందుబాటులో ఉన్నటువంటి ఆటోలు, 108 వాహనాలు రప్పించి దగ్గరగా ఉన్న ఆస్పత్రులకు తీసుకువెళ్లి వైద్యం చేయించాలన్నారు. ఆ ప్రాంత పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసి ప్రమాద వివరాలు తెలియజేసి, ప్రాణాలు కాపాడాలన్నారు. అలా చేసిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా గుడ్ సమరిటన్ పథకం ద్వారా రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసాపత్రం అందజేస్తామన్నారు. డాక్టర్ మహేంద్ర, ఎన్‌జీఓ ప్రతినిధులు శ్రీహరిబాబు పాల్గొన్నారు.